అకాల వర్షాలతో అన్నదాత కుదేలు



నేలకొరిగిన పంటను చూపిస్తున్న రైతు సుధాకర్.. (ఇన్‌సెట్‌లో) మొలకెత్తిన వరి కంకులు

- నేల కొరిగిన 60 ఎకరాల వరి పంట
- నష్ట పరిహారం ఇవ్వాలని వేడుకుంటున్న రైతులు

అమరచింత: అకాల వర్షాలకు ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో 60 ఎకరాల వరిపంట పూర్తి స్థాయిలో దెబ్బతిందని గ్రామ రైతులు తెలిపారు. జూరాల ప్రధాన ఎడమ కాల్వ కింద సాగునీరు పుష్కలంగా ఉండడంతో ఎకరానికి రూ.30 వేల పెట్టుబడి పెట్టి వరి సాగు చేశామన్నారు. ప్రస్తుతం చేతికొచ్చే సమయానికి ఆర్‌ఎన్‌ఆర్ వరి పంట పూర్తిగా నేలకొరిగి నీటిలో మునగడంతో వరి కంకులు మొలకెత్తుతున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన సుధాకర్ 8 ఎకరాలు, ఈడ్గి సునంద్‌గౌడ్ 8 ఎకరాలు, కుమ్మరి మల్లప్పకు చెందిన 12 ఎకరాలు, బాలకిష్టన్నకు చెందిన 10 ఎకరాలు, అద్దాల వెంకటన్నకు చెందిన 5 ఎకరాలు, కావలి రాజుకు చెందిన 7 ఎకరాల్లో ఆర్‌ఎన్‌ఆర్ వరిపంటను సాగుచేశారు. గట్టు నారాయణ 3 ఎకరాలు, బాలయ్య 5 ఎకరాల్లో హంసను సాగు చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. ప్రస్తుతం తమ పంట పొలాలు పశువులు సైతం మేయడానికి పనికిరాకుండా పోయాయని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం స్పందించి తమ పంటపొలాలను పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.



శేరుపల్లి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

వరి కొనుగోలులో జాప్యం తగదు



గోపాల్‌పేటలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అఖిలపక్ష నాయకులు

గోపాల్‌పేట: రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు అలసత్వం వహించకుండా రైతుల పక్షాన నిలబడి వారికి ఆసరాగా ఉండాలని జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీశ్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'రైతుల గోడుపట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు' కథనం రావడంతో అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వరిధాన్యం ఎందుకు కాంటా చేయడం లేదని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఇన్నిరోజుల నుంచి కొనుగోళ్లు సరిగా జరవపడం లేదని, హమాలీలు సరిగా లేకపోవడం వల్లనే ఇలా జరిగిందని రైతులు వారితో చెప్పారు. అనుకోకుండా వర్షం వస్తే అప్పుడు రైతులు ఇబ్బందుల్లో పడతారని ఆందోళన వ్యక్తంచేశారు. తూకం చేసేందుకు కాంటా కూడా ఒక్కటే ఉండటంతో ఇబ్బందులు అవుతున్నాయని, మరో కాంటా ఉంటే పని తొందరగా పూర్తి అవుతుందని చెప్పారు. కలెక్టర్, మంత్రి చొరవ తీసుకుని వరికొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జానంపేట రాములు, ఆర్‌టీఐ అధ్యక్షుడు కొంకి రమేష్, రమణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై స్థానిక తహసీల్దార్ సునీత సాక్షితో ఫోన్‌లో మాట్లాడారు. శుక్రవారం తాను ఐకేపీ వరికొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులు, హమాలీలతో మాట్లాడానని, ఇకపై ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని వెంకటాపురం, కంభాళాపురం, నాగసానిపల్లిలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ మురళి, కోఆప్షన్ సభ్యులు ఆరీఫ్, ఏపీఎం చంద్రకళతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాతే కేంద్రాలకు తీసురావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దామోదర్‌గౌడు, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్యాన్ని ఛేదించాలి



మదనాపురం: ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సీఎమ్మార్ రైస్ త్వరగా డెలవరీ చేసి అప్పగించాలని తహసీల్దార్ నరేందర్ సూచించారు. శుక్రవారం మదనాపురంలోని అన్నపూర్ణ రైస్‌మిల్లును కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ రైస్ అందజేతలో అవకతవకలకు పాలుపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాల్యవివాహాలు అరికట్టాలి



ఆత్మకూర్: బాల్యవివాహాలు జరుగకుండా ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని, ఈవిషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని బాలల సంరక్షణ జిల్లా అధికారి సురేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక మహిళా మండల సమాఖ్య భవనంలో మహిళలకు అవగాహన కల్పించారు. బాలలందరూ బడికి వెళ్లేలా ప్రోత్సహించాలని, పనులకు వెళ్తున్న వారిని గుర్తించి బడుల్లో చేర్పించాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడంతో పాటు, బాలలపై వేధింపులు జరుగకుండా చూడాలని, బాల్యవివాహ చట్టం గురించి అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పోక్సోచట్టం తదితర విషయాల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, ఔట్ రీచ్‌వర్కర్ నరేందర్, సీసీ మోహన్, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, మహిళాసంఘాల సభ్యులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



వీపనగండ్ల: 35 ఏళ్లుగా 347 సర్వే నెంబర్‌లో నివాసం ఉంటున్న తమను కాదని ఆ పొలాన్ని ఇతరులకు విక్రయించాలని చూస్తున్నారని అందుకు నిరసనగా గోవర్ధనగిరి గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో మాధవి అనే పట్టాదారు నుంచి సర్వే నెంబర్ 347లో ఉన్న 5 ఎకరాల భూమిలో 2.5 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన వారు ఇళ్ల స్థలాలు, గడ్డి దొడ్ల స్థలాలు ఏర్పాటు చేసుకోగా.. ఆ భూమిని రెవెన్యు రికార్డులో నాలాగా నమోదు చేయించి ఆ తరువాత వ్యవసాయ భూమిగా మార్చి మాధవికి లాభం చేకూర్చే విధంగా అధికారులు రికార్డులను మార్చారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ భూమిపై పూర్తి విచారణ జరిపించి లబ్ధిదారులకు న్యాయం చేకూర్చాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెంటయ్య, మాజీ సర్పంచ్ బాబునాయుడు, తెలంగాణ వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, మారం నారాయణరెడ్డి, వార్డ్ సభ్యులు శోభ, కవిత, నిర్మలమ్మ, రాధిక, ఉమావతి, చెన్నమ్మ, గట్టు నారాయణ తదితరులు తహసీల్దార్ పాండునాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

కల్యాణం.. కమనీయం



వనపర్తి: మండలంలోని చిమనగుంటపల్లి శివారులో ఉన్న గుండ్ల లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

కోయిల్‌కొండ: పారుపల్లిలో శనివారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు ఆన్‌లైన్ డిజిటల్ లావాదేవీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐ ఎల్‌డీఎం శ్రీనివాసరావు, బ్యాంకు లీంకేజీ డీపీఎం సల్లోమి, ఏపీఎం విజయకుమారి, వీవోలు ఆంజనేయులు, గోపమ్మ పాల్గొన్నారు.

బుద్ధుడి బాటలో పయనిద్దాం



బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: బుద్ధుడి బాటలో పయనిస్తూ.. ఆయనను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏకో పార్కులో శుక్రవారం బుద్ధుడి జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పార్కులోని బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. సారనాథ్‌లో ఐదుగురితో ప్రారంభమైన బౌద్ధ సంఘం అంచెలంచెలుగా పెరుగుతూ వచ్చిందని, ధర్మ మార్గంలో నడిచేందుకు బుద్ధుడు ఒక మార్గం ఏర్పాటు చేశాడన్నారు. జీవిత సత్యాలను తెలుపుతూ ఎందరికో మార్గదర్శకంగా నిలిచిన బుద్ధుడి అడుగు జాడల్లో నడిచేందుకు ప్రయత్నించాలని కోరారు. ఇప్పటికే చాలా మంది ప్రజలు బుద్ధుడిని ఆచరిస్తూ వస్తున్నారని, ఆయన అడుగు జాడల్లో నడిస్తే.. జీవితం ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కవి గిరి రాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, దప్పు నాగరాజు, కవి ఈశ్వర్, చీర్ల నాగేంద్రం సాగర్, దేవన్న నాయుడు, బాలస్వామినాయుడు, రంగస్వామి, రవిరాజ్, రాము, శేఖర్ పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటాలు చేసేది సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు

పాన్‌గల్: పేదలు, కార్మికులు, కర్షకుల పక్షాన పోరాటాలు చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నది కేవలం సీపీఐ పార్టీయేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సంపదను సృష్టించే కర్షకులు, కార్మికులు, కూలీల అభ్యున్నతి కోసం పాలకులు బడ్జెట్‌లో తగు నిధులు కేటాయించడం లేదన్నారు. స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు గడిచినా పేదలు మరింత పేదలుగా మారుతున్నారని, ధనవంతులు మరింత సంపన్నులవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు. ప్రపంచం ఆకలి సూచీలో భారతదేశం 107వ స్థానంలో ఉండటమే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. హక్కుల సాధన కోసం ఆయా వర్గాలతో కలిసి పార్టీ పోరాటాలు చేస్తున్న ఘనత సీపీఐకే దక్కిందన్నారు. కార్యక్రమంలో డంగు కుర్మయ్య, సహదేవ్, రాములు, నరసింహ, పరంధాములు, శంకరయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

హమాలీ చార్జీలను ప్రభుత్వమే భరించాలి



కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

పాన్‌గల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీల చార్జీలను ప్రభుత్వమే భరించాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీల చార్జీలను రైతుల నుంచి వసూలు చేయడం సరికాదన్నారు. క్వింటాలుకు రూ.45 చెల్లించడం రైతులకు భారంగా మారిందన్నారు. అకాల వర్షానికి కేంద్రాల్లో ధాన్యం తడవకుండా రైతులకు కవర్లు పంపిణీ చేయాలన్నారు. తేమ పేరుతో ధాన్యం తూకంలో జాప్యం చేయవద్దని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు తొలగించాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లింగన్న, రాముడు, నరసింహ, శంకరయ్య, పరంధాములు పాల్గొన్నారు.

రేమద్దులలో బొడ్రాళ్ల ప్రతిష్ఠాపనోత్సవాలు



బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన పూజలో సర్పంచ్, గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో శుక్రవారం బొడ్రాళ్ల ఉత్సవాలను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి అన్ని దిక్కులకు ఉన్న రోడ్ల చివరిలో బొడ్రాళ్లను ప్రతిష్ఠించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బొడ్రాళ్లకు సర్పంచ్ మంజుల, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పూజలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. బొడ్రాళ్లను ప్రతిష్ఠించిన అనంతరం గ్రామంలోని రామాలయంలో హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విండో డైరెక్టర్ ప్రసాద్‌రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాంబాబు, బీఆర్ఎస్ నాయకులు కతాల్, తిరుపతయ్య,గోపాల్‌రావు, నిరంజన్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాలరాయొద్దు



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీపీఎం అనుబంధ సంస్థ అయిన రైతు సంఘం ఆధ్వర్యంలో మే డే సంబురాలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, రాఘవేంద్ర మాట్లాడుతూ నాడు పని గంటల కుదింపు కోసం యాజమాన్యంతో పోరాడి అసువులు బాసిన అమర కార్మికుల త్యాగాలను స్మరించుకుంటూ మేడే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాయడానికి కుట్రలు పన్నుతున్నాయని వీటిని సమర్థవంతంగా కార్మికులు కలిసికట్టుగా ఎదురించాలని కోరారు. కార్యక్రమంలో మహేష్, తరుణ్, మొగిలన్న, వెంకటేష్, అంజి, మల్లేష్, రాము, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి



కోడేరులో భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీరామ్

కోడేరు: మండలంలోని రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీరామ్ రైతులను కోరారు. శుక్రవారం మండల కేంద్రం కోడేరులో రైతు పంట పొలాలో మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలపై అవగాహన కల్పించి మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించుకోవడంతో భూమిలో రైతు పండించే పొల్లాలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఎంత మోతాదు ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. రైతులు అధిక దిగుబడి ఆశించి, విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడటంతో పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. ప్రతిఒక్క రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మధుసూదన్ రైతులు పాల్గొన్నారు.

నేడు మానసిక వైద్యశిబిరం

పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మానసిక వైద్యురాలు డా.అంబుజా ఆధ్వర్యంలో శనివారం మానసిక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మానసిక ఆందోళన, తనలో తాను మాట్లాడుకోవడం, పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం వంటి అనుమానిత లక్షణాలు ఉన్న వారు ఉచిత మానసిక వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భరోసా సభను జయప్రదం చేయండి

ఆత్మకూర్: తెలంగాణ బహుజన సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీన జరుగనున్న తెలంగాణ భరోసా సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలెం వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లో నాయకులతో కలిసి సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సభకు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి హాజరవుతున్నారని, బహుజనులు ఏకమై సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్జున్‌రాజు, నరేందర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, ప్రకాష్, సహదేవ్, కుర్మన్న, పరశురాం, పుత్రసేన, తదితరులు పాల్గొన్నారు.

యోగా మహోత్సవాన్ని సద్వినియోగం చేసుకుందాం

ఖిల్లాఘనపురం: మండలంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే యోగా మహోత్సవాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ మండల ఇన్‌చార్జ్ దీర్ఘాయువు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహోత్సవంలో భాగంగా పద్మశాలి కల్యాణ మండపంలో మూడు రోజుల పాటు సాయంత్రం 6 నుంచి 7:30 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ఆసనాలు, ప్రాణాయామం, ముద్రలు, ధ్యానం చేయించడంపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి ఆలయంలో బుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మంగళ వాయిద్యాల మధ్య పండితులు వేద మంత్రోచ్ఛరణలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. భక్తులు గోవిందనామ స్మరణతో కార్యక్రమాన్ని వీక్షించారు. వేడుక అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు విష్ణునారాయణ, అర్చకులు గోవిందాచార్యులు, సురేష్ ఆచార్యులు, కన్నయ్యస్వామి పాల్గొన్నారు.

బీజేపీకో హటావో దేశ్‌కో బచావో

పెద్దకొత్తపల్లి: సీపీఐ ఇంటింటికి కార్యక్రమాన్ని శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బాల్‌నర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో దేశంలో వివిధ రంగాల్లో కొనసాగుతున్న అన్యాయాలను ప్రజలకు తెలియజేయడానికి ఇంటింటికి సీపీఐ కార్యక్రమం చేపట్టామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని అన్నారు. కార్యక్రమంలో నర్సింహ, ఫయాజ్, ఏసయ్య, లక్ష్మిపతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ 'ఆధార్' అప్‌డేట్ చేసుకోవాలి



ఆధార్ అప్‌డేట్ పత్రాన్ని అందజేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్

పాన్‌గల్: ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు దాటిన ప్రతి ఒక్కరూ అప్‌డేట్ చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ చక్రపాణి అన్నారు. శుక్రవారం మండలంలోని బహదూర్‌గూడెం జీపీ భవనంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఆయన స్థానిక సర్పంచ్ విష్ణునాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి జీపీల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ప్రతి జీపీలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఏ వెంకటయ్య, ఆధార్ కేంద్రం నిర్వాహకులు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి విగ్రహ ప్రతిష్ఠాపన



శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి . ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పెంట్లవెల్లి: గ్రామంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం రోజు ఘనంగా నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ముఖ్య అతిథులుగా పీఠాధిపతులు ఈశ్వరాదేవి మఠాధిపతులు వీరకుమారస్వామి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం మంత్ర పుష్పం, హోమం, మంగళహారతి, గణపతిపూజా, పుణ్యావచనం వంటి కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపనను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మూడు రోజులుగా వచ్చిన భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని పెంట్లవెల్లి ఎంపీటీసీ సుమలత శేషేంద్రప్రసాద్ నిర్వహించారు.

హాజరైన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి..

ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం కమిటీ పెద్దలతో మాట్లాడి చర్చించారు. అంతే కాకుండా ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఆలయ కాంపౌండ్ నిర్మాణం కోసం రూ.10 లక్షలు మంజూరు చేస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం పీఠాధిపతులతో ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుదర్శనాచారి, సత్యనారాయణ, శ్రీనివాసులు, శివశంకర్, శేషేంద్రప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ జెండాను తొలగించండి'

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో ఆర్‌అండ్‌బీ నిబంధనలకు విరుద్ధంగా డివైడర్ పై వేయించిన బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుతో పాటు, ఏర్పాటు చేసిన జెండాను వెంటనే తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి డిమాండ్ చేశారు. ఈసందర్భంగా శనివారం మండల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కోయిల్‌కొండలో ఏర్పాటు చేసిన నాలుగు వరుసల రహదారి మధ్యలో డివైడర్ కు ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా గులాబీ రంగులు వేయడం సరికాదన్నారు. బీజేవైఎం రాష్ట్ర లీగల్ కన్వీనర్ కేశవులు, మండల ప్రధానకార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాఘవ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

కొల్లాపూర్: యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఐఆర్ఎస్ అధికారి ఉదయ్‌కుమార్ సూచించారు. కొల్లాపూర్‌లో సమృద్ధి భారతి రాష్ట్రీయ ట్రస్ట్, కేవైఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాలిసెట్ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. శిబిరాన్ని ఉదయ్‌కుమార్‌తో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యేల్లేని సుధాకర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని విద్యార్థులు, యువతకు మేలు చేయాలనే సంకల్పంతో ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. నాయకులు శేఖర్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, సత్యనారాయణ గౌడ్, సాయికృష్ణగౌడ్, భీమేష్ తదితరులు ఉన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



అమరచింతలో వివరాలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ మంగమ్మ



బండపల్లిలో..

అమరచింత: సీఎం కేసీఆర్ ముందు చూపుతో రెండోవిడతలో భాగంగా ప్రారంభించిన కంటి వెలుగు శిబిరాలు నిరు పేదల పాలిట వరంగా మారిందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. మున్సిపాలిటీలోని ఎనిమిదో వార్డులో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో అన్ని వార్డుల వారీగా కంటివెలుగు శిబిరాలు నిర్వహించి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఒకటి, ఎనిమిది, మూడో వార్డుల్లో కంటి పరీక్షల శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం కమిషనర్ మహమ్మద్ ఖాజా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని కంటివెలుగు శిబిరానికి తీసుకొచ్చి కంటి పరీక్షలు నిర్వహించుకునేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ సామ్రాజ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు రోహేలా, కౌన్సిలర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బండపల్లిలో..

పాన్‌గల్: మండలంలోని బండపల్లిలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన కంటి వెలుగు శిబిరం శుక్రవారంతో ముగిసినట్లు సర్పంచ్ రాజేశ్వరమ్మ తెలిపారు. గ్రామంలో నిర్వహించిన కంటివెలుగు శిబిరం స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో 18ఏళ్ల పైబడిన వారందరూ పరీక్షలు చేయించుకున్నట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంమూర్తినాయుడు, ఉప సర్పంచ్ ఆంజనేయులు, వైద్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

184 మందికి పరీక్షలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం పట్టణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో 184 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.